క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి



తహసీల్దార్ వెంకటరావు

ఇచ్ఛాపురం రూరల్: రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావు హెచ్చరించారు. తన కార్యాలయంలో పలు శాఖాధికారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించి వారిని అప్రమత్తం చేశారు. బహుదానదితో పాటు కాజ్‌వే, గెడ్డలు, వాగుల్లో నీరు ప్రవాహం అధికంగా ఉండటంతో పాదాచారులు, వాహన చోదకులను నియంత్రించాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లకుండా ముందస్తుగా దండోరా వేయించాలన్నారు. అధికారులు మూడు రోజుల పాటు గ్రామాల్లో ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సమయాల్లో 91141 15363 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు!

• తప్పిన ప్రమాదం



విద్యుత్ స్తంభానికి సమీపంలో నిలిచిపోయిన బస్సు

సంతబొమ్మాళి: ఇజ్జువరం గ్రామ సమీపంలో మంగళవారం ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. టెక్కలి వయా పూండి మీదుగా పలాస వెళ్తున్న బస్సు ఇజ్జువరం సమీపంలో గొర్రెల మందను డ్రైవర్ తప్పించే క్రమంలో అదుపు తప్పింది. దీంతో రోడ్డు పక్కన పైప్‌లైన్ల గోతులను కప్పిన మట్టిపైకి వెళ్లడంతో బస్సు టైర్లు కూరికి పోవడంతో 33 కేవీ లైన్‌కి అతి సమీపంలో ఆగిపోయింది. అక్కడకు అతి సమీపంలోనే విద్యుత్ స్తంభం ఉంది. ఏమాత్రం ముందుకు బస్సు వెళ్లిన పెను ప్రమాదం జరిగేదని ప్రయాణికులు ఆందోళన చెందారు.

లడ్డూపై అసత్య ప్రచారం తగదు



శిష్టు గోపి

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి తిరుమల లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు అసత్య ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పలాస పట్టణ అధికార ప్రతినిధి శిష్టు గోపి అన్నారు. పలాసలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం అట్టర్‌ప్లాప్ అయిందన్నారు. ప్రజల దృష్టి మళ్లించడం కోసం తిరుమల ప్రసాదానికి వినియోగించే నెయ్యిలో గత ప్రభుత్వ హయాంలో కల్తీ జరిగినట్లుగా దుర్మార్గపు ఆరోపణలు చంద్రబాబు చేయడం అన్యాయమన్నారు.

ఎమ్మెల్యే శిరీషను కలిసిన విజిలెన్స్ ఎస్పీ



శిరీషకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాదరావు

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను జిల్లా విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఏపీటీపీసీ చైర్మన్‌గా బాబూరావు



వజ్జ బాబూరావు

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్‌గా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్ వజ్జ బాబూరావు నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి బాబూరావు ఒక్కరికే అవకాశం దక్కింది. గతంలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్‌గా ఈయన పని చేసి ఉన్నారు.

28న 'మన ఇల్లు-మన గౌరవం'

ఇచ్ఛాపురం రూరల్: ఈనెల 28వ తేదీన కాలనీలు, లే అవుట్‌ల వద్ద చేపట్టనున్న 'మన ఇల్లు-మన గౌరవం' అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్యేకాధికారి, ఏపీడీ చల్లా శ్రీనివాసరెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సగం నిర్మాణంలో నిలిచిపోయిన గృహ లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, వారికి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో కె.రామారావు, ఐసీడీఎస్ సీడీపీవో పురాణం నాగరాణి పాల్గొన్నారు.

• దసరా సందడి



కంచిలి మండలం జలంత్రకోట గ్రామంలో దసరా ఉత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామదేవత లిమ్మేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి హాజరై పూజలు చేశారు. నాయకులు లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్, డొక్కర బలరాం, గణప సింహాచలం, రమేష్, ప్రకాష్ చంద్రపండా, రమేష్ గౌడ, కొయిరా గౌడో, శ్రీకాంత్ గౌడో, సుర్జిత్ గౌడో తదితరులున్నారు.

– కంచిలి

• నాణ్యత పరిశీలన

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రోడ్ల నాణ్యతను విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. శ్రీకాకుళం యూనిట్ విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు నేతృత్వంలోని బృందం చినబడం నుంచి అంతరకుడ్డ గ్రామం వరకు రూ.55 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును పరిశీలించారు. శాంపిల్స్ కోసం రోడ్డును తవ్వి తారు పూత, రింగురాళ్లు, క్రషర్‌బుగ్గి, కంకర సేకరించారు. పట్టణంలోని పలు రోడ్లను పరిశీలించారు. విజిలెన్స్ డీఎస్పీ ఎస్.కిరణ్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

– కాశీబుగ్గ



• రాష్ట్రస్థాయి పోటీలకు..



తిరుపతిలో వచ్చే నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కోచ్ నర్సిపురం శేఖర్ మంగళవారం తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ సెలక్షన్ పోటీలో ప్రతిభ కనబర్చడం ద్వారా అండర్-14 బాలికల 29 కేజీల విభాగంలో మెండ తపస్వీ, ఎస్.మోహిత్, కూన ధరణి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

– టెక్కలి రూరల్

చెలరేగిపోతున్న మట్టి మాఫియా!

• చెరువు గట్టున తవ్వేసిన వైనం



మట్టిని తవ్వేసిన కాగితపు బంద చెరువు గట్టు

వజ్రపుకొత్తూరు: మట్టి మాఫియా చెలరేగిపోతోంది. అవకాశం ఉన్నదగ్గర యథేచ్ఛగా మట్టిని తవ్వేసి తరలించుకుపోయి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి పెద్దమురహరిపురంలో తాజాగా చోటుచేసుకున్న సంఘటనను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. పెద్దమురహరిపురం సర్వే నంబర్ 71లోని కాగితపు బంద చెరువు గట్టుపై మట్టి మాఫియా కన్నుపడింది. కూటమి ప్రభుత్వానికి చెందిన కొంతమంది చెరువు గట్టును జేసీబీలతో తవి సి మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పూండి వర్తక వ్యాపార కేంద్రానికి ఆనుకుని ఈ చెరువు ఉండడంతో ఇక్కడ భూములు అధిక ధరలు పలుకుతున్నాయి. సెంటు రూ.3.50 లక్షలు వరకు అమ్ముడుపోతుంది. దీంతో గట్టును తవ్వి ఆ భూములకు చెరువు గట్టును రోడ్డుగా చేసి రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి సొమ్ము చేసుకునే ఎత్తుగడ కొంతమంది నాయకులు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే సుమారు 500 మీటర్ల మేర చెరువు గట్టును తవ్వి ఐదు ట్రాక్టర్లతో మట్టిని తరలించారు. గతంలోనే ఈ చెరువు గట్టు దాదాపు 25 సెంట్లు మేర ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. అయినప్పటికీ ఎవరూ అక్రమార్కులను నిలవరించే ప్రయత్నం చేయడం లేదు. అధికారులకు తెలిసినా మిన్నకుండిపోవడంతో చెరువు గట్లు అన్యాక్రాంతమవుతున్నాయి.

విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలి



సోంపేట: పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న విద్యార్థులు



కాశీబుగ్గ: పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు

సోంపేట: విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.మోహనరావు అన్నారు. జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రం చేశారు. అధ్యాపకులు రజనికుమారి, రామినాయుడు, ఎం.ప్రసాద్, యుగంధర్ ఉన్నారు.

కాశీబుగ్గ: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవా స్ఫూర్తి అలవరచుకొని జీవితాలను సార్థకం చేసుకోవాలని పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి అన్నారు. ఎన్ఎస్ఎస్ డేను కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హే సేవా కార్యక్రమాన్ని నిర్వహించి కాలేజీ పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ పీవో కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినాన పాపారావు, ఏజీఎంసీ పి.చిరంజీవులు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా ఎన్ఎస్ఎస్ దినోత్సవం ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఎన్‌సీసీతో ఉన్నత అవకాశాలు



ఎంపికలు నిర్వహిస్తున్న ఎన్‌సీసీ అధికారులు

టెక్కలి: ఎన్‌సీసీలో ప్రవేశంతో విద్యార్థులకు ఉన్నత అవకాశాలు లభిస్తాయని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అన్నారు. కళాశాల ప్రాంగణంలో జిల్లా బెటాలియన్ సుబేదార్ సి.రవికుమార్ పర్యవేక్షణలో ఎన్‌సీసీ ఎంపికలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 271 మంది విద్యార్థులు హాజరు కాగా చివరగా 35 మందిని ఎంపిక చేశారు. అనంతరం కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో ప్రవేశం వలన వ్యక్తిగత క్రమ శిక్షణతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతోందన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉంటే విద్య, ఉద్యోగాల ఎంపికల సమయంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కోఆర్డినేటర్ డి.విష్ణుమూర్తి, ఎల్‌టీ టి.మురళీమోహన్, హవల్దార్ జి.ఎస్.రెడ్డి, సుబేదార్ నాయక్, ఎన్‌సీసీ ట్రైనర్ ఎస్.భుజంగరావు, పీడీలు ఎస్.లక్ష్మణరావు, జే.తేజేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న సంతోష్ మిశ్రా

టెక్కలి: రోడ్డు ప్రమాదాల నివారణపై సామాజిక చైతన్యం కల్పించే దిశగా విద్యార్థులు కార్యక్రమాలు నిర్వహించాలని నేషనల్ టూరిస్ట్ అండ్ సైక్లిస్ట్ సంతోష్ మిశ్రా కోరారు. జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని పురస్కరించుకుని రోడ్డు ప్రమాదాల నివారణపై మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రయాణంలో సరైన నియమాలు పాటించకపోవడంతో ఏటా చాలా మంది ప్రాణాలు కోల్పోతుండడంతో ఆయా కుటుంబాలు నడిరోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు వి.ల్యూక్‌పాల్, కె.గొల్ల పాల్గొన్నారు.

మార్చి నాటికి పీఎంఆర్‌వై గృహ నిర్మాణాలు పూర్తి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి గడ్డెమ్మ

కోటబొమ్మాళి: మండలంలోని 27 సచివాలయాల పరిధిలో వివిధ దశల్లోఉన్న పీఎంఆర్‌వై ఇళ్ల నిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యేలా చూడాలని కోటబొమ్మాళి మండల ప్రత్యేకాధికారి, బీసీ కార్పొరేషన్ ఏడీ ఆర్.గడ్డెమ్మ అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణశాఖాధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించి ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 28న అన్ని లేఅవుట్ల వద్ద మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, ఈవోపీఆర్డీ రామారావు ఉన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..



జావెలిన్ త్రో విసురుతున్న విద్యార్థి

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇందులో టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం మండలాలకు చెందిన విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న క్రీడల్లో భాగంగా మొదటి రోజు అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. బాలబాలికలు సందడి చేశారు.

అభివృద్ధికి కృషి

కాశీబుగ్గ: కాశీబుగ్గ-పలాస మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. 11వవార్డు టీడీపీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ త్యాడి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అర్హులందరికీ పింఛన్లు అందిస్తామన్నారు. రైల్వే వంతెన నిర్వాసితుల విషయమై అధికారులతో సమీక్షించి సత్వర న్యాయం జరిగేందుకు కృషి చేస్తానని చెప్పారు. వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ చేయాలని అధికారులను కోరారు. నాయకులు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, కోట్ని దుర్గాప్రసాద్, దువ్వాడ శ్రీకాంత్ ఉన్నారు.

సైన్స్ సంబరాలు విజయవంతం చేయండి

టెక్కలి: విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక ఆలోచనలకు వేదికగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 25న పాఠశాల స్థాయి, అక్టోబర్ ఒకటో తేదీన మండల స్థాయి, 27న జిల్లా స్థాయి, నవంబర్ 9, 10 తేదీలలో రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని వినతి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురంలోని బృందావన కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని వార్డు పెద్దలు జగన్, జానీలు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

విద్యార్థినులకు అవగాహన

నందిగాం: ఆడపిల్లలను సంరక్షించుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా మహిళా, శిశుసంక్షేమ శాఖ వారి వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ బి.కవిత అన్నారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మహిళా సంక్షేమంపై విద్యార్థినులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఆడపిల్లలను చదివించడంతో పాటు వారి స్వీయరక్షణకు తగు జాగ్రతలు తీసుకునేలా వారిని చైతన్య పరచాలన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వాణి ఉన్నారు.

ఈదుపురంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామంలో ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ తరఫున స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సొసైటీ సభ్యులు, యువకులు గ్రామ కూడళ్లలో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలను తొలగించారు. సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గయా రామచంద్ర బెహరా, నేషనల్ యూత్ వలంటీర్ హంగిర్ బెహరా, ఎం.మురా బెహరా పాల్గొన్నారు.

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

టెక్కలి రూరల్: తన కుమార్తె రెండు రోజులుగా కనిపించడం లేదని టెక్కలి అలగ్జండర్ వీధికి చెందిన వ్యక్తి మంగళవారం ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ నెల 22వ తేదీన తన కుమార్తె ఇంటి తాళాన్ని పక్క ఇంట్లో వారికి ఇచ్చేసి వెళ్లిందని.. తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీసిన చంద్రబాబు

• వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసమే పవిత్రమైన వేంకటేశ్వరస్వామి లడ్డూను అపవిత్రం చేసేలా భక్తుల మనోభావాలను దెబ్బతీశారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ లడ్డూ కల్తీ జరిగిందంటూ సీఎం స్థాయిలో ఉన్న చంద్రబాబు లేని పోని విమర్శలు చేయడం సరికాదన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించి దోషులను శిక్షించాలన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడంతో వంద రోజుల పాలనలో ప్రజల్లో తిరుగుబాటు రావడంతో దాని నుంచి తప్పించుకునేందుకు పవిత్రమైన తిరుపతి లడ్డూ వ్యవహారాన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కవిటి: జగతిలో క్షేత్ర పర్యటన చేస్తున్న సిబ్బంది



టెక్కలి: పోలవరంలో రైతులకు సూచనలిస్తున్న సిబ్బంది



వజ్రపుకొత్తూరు: పాతటెక్కలిలో కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది

రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయశాఖ అధికారులు అన్నారు. సామూహిక సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవచ్చునని సూచించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఎరువుల వినియోగం, ఈపంట నమోదుపై అవగాహన కల్పించారు. ఉద్యాన పంటల సాగుతో చేకూరే ప్రయోజనాన్ని వివరించారు. మండల వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, సచివాలయ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు

• పశుసంవర్ధకశాఖ జేడీ మురళీధర్



మాట్లాడుతున్న జేడీ మురళీధర్

కోటబొమ్మాళి: పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ ఆర్.మురళీధర్ చెప్పారు. చిట్టివలస గ్రామంలో పశువైద్య శిబిరం, లేగదూడల ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడిరైతులతో జరిగిన సభలో మాట్లాడారు. జిల్లాలో పాలదిగుబడి పెంచేందుకు ఆవులకు మేలుజాతి ఆడ దూడలు జన్మించేలా గర్భకోశ టీకాలు వేస్తున్నామని చెప్పారు. అలాగే రాయితీపై పశుదాణాను అందజేస్తున్నామన్నారు. ప్రతి పంచాయతీలో గోకులం షెడ్ల నిర్మాణానికి రాయితీపై నిధులు అందజేస్తామన్నారు. లేగదూడల ప్రదర్శనలో ఎంపికైన ముగ్గురు రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వెటర్నరీ ఉప సంచాలకులు సీహెచ్ సత్యప్రకాష్, ఏడీ మంద లోకనాథం, కురుడు పశువైద్యుడు ఎల్.కిరణ్‌కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కింజరాపు హరివర ప్రసాద్ ఉన్నారు.

సూపర్‌సిక్స్ అమల్లో కూటమి ప్రభుత్వం ఫెయిల్

• ఎమ్మెల్సీ నర్తు రామారావు
• కంచిలి మండల సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

కంచిలి: వంద రోజుల కూటమి ప్రభుత్వ హయాంలో పాలకులు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా ఫెయిలయ్యాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు వ్యాఖ్యానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇటీవల కవిటి మండలం రాజపురం గ్రామంలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి హాజరవుతారని కూటమి నాయకులు ఆర్భాటం చేశారన్నారు. అయితే సీఎం చంద్రబాబు పర్యటన రద్దయ్యిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చకపోయిన దానికి అటువంటి ఆర్భాటాలు ఎందుకని ప్రశ్నించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజకీయాలు చూడకుండా పరిపాలన సాగించడం జరిగిందన్నారు. ఇప్పుడు కూడా అధికారులు నిబద్ధతతో, నిష్పక్షపాతంగా పథకాలను అమలు చేయాలని సూచించారు. సమావేశంలో పలు శాఖలకు సంబంధించి చర్చ జరిపారు. ఎరువులు మండల రైతాంగానికి సరిపడా సరఫరా చేయలేదని ఎంపీపీ దేవదాస్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవో వి.నీరజ, తహసీల్దార్ వై.జయలక్ష్మి పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 45 మంది ఎంపిక

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ కణితీష్ ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం జాబ్ మేళా జరిగింది. వివిధ కంపెనీలు పాల్గొన్నాయి. ఉద్యోగాలకు 45 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పైల జవహార్ తెలిపారు. వీరిలో సినార్జి కాస్టింగ్‌కు 30 మంది, అపోలో ఫార్మసీకి 12 మంది, అరబిందోకు ముగ్గురు ఎంపికయ్యారు.

మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

కాశీబుగ్గ: మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై పలాస మాజీ సైనికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సైనికుల యూనియన్ అధ్యక్షుడు ఇళ్ల మన్మథరావు, ఉపాధ్యక్షుడు బంగారు బారికి, కార్యదర్శి ఇప్పిలి తాతయ్య ఉన్నారు.

బారువ రైల్వేస్టేషన్ సాధన కమిటీ ఏర్పాటు

సోంపేట: బారువ రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సాధన కమిటీ ఏర్పాటైంది. బారువ పరిసర ప్రాంతాల ప్రతినిధులు ఏకగ్రీవంగా కమిటీని మంగళవారం ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా రాంబుడ్డి గణపతి, ఉపాధ్యక్షులుగా బారువ, సుంకిడి సర్పంచ్‌లు యర్ర రజని, శిలగాన భాస్కరరావు, బతకల మోహనరావు, ఉత్తరాల బ్రహ్మానందం, దున్న సత్యం, ప్రధాన కార్యదర్శిగా రత్నాల శ్రీనివాసరావు, కన్వీనర్‌గా మద్దు కుమార్‌ను ఎన్నుకున్నారు.